జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

సోమవారం | 9-2-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 587 పేజీలు: 4 వెల : రూ.7

# పాత్రికేయ వృత్తికి వన్నె తేవాలి





* ప్రభుత్వ విప్, శాసన సభ్యులు బెందాళం అశోక్ * పాత్రికేయుడు.. ఎప్పుడూ విద్యార్థే * సీఆర్ మీడియా అధ్యక్షులు ఆలపాటి సురేష్ కుమార్ * సోంపేటలో జిల్లా గ్రామీణ విలేఖరులకు పునశ్చరణ తరగతులు

**సోంపేట,ఫిబ్రవరి8(వార్త):** పాత్రికేయులు.. తమ వృత్తికి వన్నె తేవాలని ప్రభుత్వ విప్, శాసన సభ్యులు బెందాళం అశోక్ సూచించారు. సి.ఆర్. మీడియా అకాడమీ ఆధ్వర్యంలో సోంపేటలోని విబిఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జిల్లా గ్రామీణ విలేఖరుల పునశ్చరణ తరగతులను సురేష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బెందాళం అశోక్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో ప్రజల భావాలను సమాజానికి పాత్రికేయులు తెలియజేసేవారన్నారు. పత్రికా సమాచారంతో స్వాతంత్ర్యద్యోమం మరింత బలోపేతమయిందని చెప్పారు. వ్యవస్థలో ఉన్న లోపాలను చూపాలని, వ్యక్తిగత దూషణలకు పోరాదన్నారు. పాత్రికేయ వృత్తికి న్యాయం చేయాలని కోరారు. పత్రికలు తరచు చదువుతూ ఉంటే మరింత మేధాశక్తి పెరుగుతోందని, వార్తలు ఎలా రాయాలో తెలుస్తోందన్నారు. సిఆర్ మీడియా అధ్యక్షులు ఆలపాటి సురేష్ కుమార్ మాట్లాడుతూ పాత్రికేయ రంగంలో ఎంత అనుభవం ఉన్నా, విద్యార్థిగానే ఉండాలని, తాను ఇప్పటికీ నేర్చుకుంటూనే ఉన్నానని అన్నారు. ఈగ్రామీణ పాత్రికేయులకు పునశ్చరణ తరగతులు నిర్వహించడమే ప్రెస్ అకాడమీ ముఖ్య ఉద్దేశమన్నారు. తెలుగు రాష్ట్రాలలో ఉన్న మీడియా విస్తృతి మరెక్కడా లేదన్నారు. జర్నలిజంపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. నేర్చుకోవడమనేది జీవితంలో ఒక భాగం కావాలన్నారు. ప్రతీ రోజు దినపత్రికలు, పుస్తకాలు చదువుతూ ఉండాలని చెప్పారు. భావ ప్రకటన స్వేచ్ఛలోనే పత్రికా స్వేచ్ఛ ఉందన్నారు. ఎవరి హక్కులకు భంగం కలిగించకూడదన్నారు. ప్రజలకు ఉపయోగపడే వార్తలను తెలియజేయాలని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, ప్రజల స్వేచ్ఛలను ప్రజలకు తెలియజేయాలని చెప్పారు. టెక్నాలజీ రంగంలో నూతన ఆవిష్కరణలు వస్తుంటాయి, పోతుంటాయని చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిన్స్ ఎంత గొప్పదైనా మనకు లోబడి ఉంటుందన్నారు. సోంపేట మండల పరిషత్ అధ్యక్షులు దాసు మాట్లాడుతూ ఉద్దానం కిడ్నీ వ్యాధి గూర్చి ప్రపంచానికి చాటి చెప్పిన పాత్రికేయులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఎన్నో సమస్యలు వెలుగులోకి తెచ్చేది పాత్రికేయులన్నారు. తెలుగు ఆర్టిఫిషియల్ ఇంటిలిన్స్, కృత్రిమ మేధాపై సీనియర్ జర్నలిస్ట్ ట్రైనర్ విజయ్ కుమార్ కుర్రా వివరించారు. ఉత్తరాంధ్ర గ్రామీణ జర్నలిజం ఎఐతో నమ్మకమైన కొత్త దారి తెలుస్తుందన్నారు. వృత్తి నైపుణ్యాభివృద్ధి చేసుకోవాలన్నారు. మెరుగైన నాణ్యతా ప్రమాణాలను మెరుగుపరచుకోవాలని వివరించారు. శ్రీకాకుళం సామాజిక వాస్తవం వ్యవసాయం ఆధారిత జీవం, జీడి ప్రాసెసింగ్, రైల్వే అభివృద్ధి, మార్పు గురించి అవగాహన, నిధుల వాస్తవం, జర్నలిస్టు ఎందుకు ముఖ్యం, ప్రస్తుత నైపుణ్య లోటులు, సానుకూల పరిష్కారం, సమస్యల రిపోర్టింగ్‌లో లోటు, సీనియర్ల నుండి నేర్చుకోవలసినవి, తదితర అంశాలపై వివరించారు. ఆర్.టివి బ్యూరో చీఫ్ రామచంద్రరావు మాట్లాడుతూ జర్నలిస్ట్‌లు వృత్తి నైపుణ్యాన్ని వృద్ధి చేసుకోవాలన్నారు. రిపోర్టింగ్ విజయవంతం అవ్వాలంటే గ్రౌండ్ రిపోర్టింగ్ ముఖ్యమన్నారు. ఈ టీవి బ్యూరో చీఫ్ కూర్మరాజు మాట్లాడుతూ ప్రాధాన్యతను తెలుసుకొని ముందుగా బ్రేకింగ్ న్యూస్ ఇస్తే ప్రజలకు తెలుస్తోందన్నారు. ఎలక్ట్రానిక్ మీడియాలో వేగం, విశ్వసనీయత ఉండాలన్నారు. స్క్రోలింగ్ ఇచ్చేటప్పుడు చాలా జాగ్రత్తగా ఒకటికి రెండు సార్లు కన్ఫర్మేషన్ చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐజెయు జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లి ధర్మారావు, సిఆర్ అకాడమీ కార్యదర్శి వి.మణిరాం, డిపిఆర్ఓ కమ్మినాన చెన్నకేశవరావు, సీనియర్ పాత్రికేయులు బొడ్డుపల్లి రాజగోపాలరావు, ఎపియుడబ్ల్యుజె జిల్లా అధ్యక్షులు సిహెచ్ జగదీష్, కార్యదర్శి సనపల రమేష్, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర కార్యదర్శి రాజు, గ్రామీణ పాత్రికేయులు పాల్గొన్నారు.



# వైభవం.. వాసుదేవుని అభిషేకం

* రెండో రోజుకు బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవాలు
* తరలివచ్చిన భక్తజనం * గోవిందా నామస్మరణతో మార్మోగిన వాసుదేవ పెరుమాళ్ స్వామి ఆలయం

**మందస, ఫిబ్రవరి 8(వార్త):** బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవాలు రెండో రోజు ఆదివారం ఉత్సవారంభ స్నపనం జరిగింది. భక్తులు గోవిందా.. జై శ్రీమన్నారాయణ... నామస్మరణల మధ్య శ్రీవాసుదేవ పెరుమాళ్ స్వామి అభిషేక మహోత్సవం నిర్వహించారు. స్వామివారి నిజ స్వరూపాన్ని భక్తులు తిలకించి భక్తి పారవశ్యంతో మునిగి తేలారు. శ్రీవాసుదేవపెరుమాళుని నిజస్వరూపానికి అభిషేకం చేయడంతో ఉత్సవాలు ప్రారంభమైనట్టు ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితులు గోపినాంబాళ్ల దాసుకూర్మాచార్యులు చెప్పారు. అర్చకులతో పాటు పండితులు వేదమంత్రోచ్చారణల మధ్య స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రాతఃకాల సమయమైన 5గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు, సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 9గంటల వరకు సుప్రభాతసేవ, ప్రాతఃకాలారాధన, నివేదన, గోష్ఠి, యాగశాలలో ధ్వారతోరణ, ధ్వజకుంభారాధన, వేద విన్నపములు, చతుఃస్థానార్చన, విశేషహోమములు, పంచసూక్తపరివార, ప్రాయశ్చిత్త హోమములు, నివేదన, నిత్యపూర్ణాహుతి, బలిహారణ, శాత్తుముర్రై, ప్రసాదగోష్టి తదితర కార్యక్రమాలు జరిగాయి. అనంతరం జీయర్ స్వాములు అనుగ్రహభాషణం జరిగింది. విశ్వక్సేన ఆరాధన, వైనతేయ పటాధివాసం, ఋత్విక్వరుణం తదితర కార్యక్రమాలు జరిగాయి. పోలీసులతో బ్రహ్మోత్సవాలకు బందోబస్తు కల్పించారు.

## విశాఖ జూకు..
# ఎలుగుబంటి

* జీడితోటలో ఐరన్ ఫెన్సింగ్‌కు చిక్కుకున్న భల్లూకం
* అరుపులతో దద్దరిల్లిన అనకాపల్లి గ్రామస్తులు
* అటవీ శాఖాధికారులకు సమాచారం
* ఆపరేషన్ భల్లూకం చేపట్టిన ఫారెస్టు అధికారులు
* ఎలుగును బంధించి విశాఖ జూకు తరలింపు



**పలాస, ఫిబ్రవరి 8 (వార్త):** వజ్రపుకొత్తూరు మండలం చీపురుపల్లి పంచాయతీ పరిధి అనకాపల్లి వద్ద జీడి తోటలో కంచెకు శనివారం రాత్రి ఓ భల్లూకం చిక్కుకుంది. దాని నుంచి బయటకు రాలేక పెద్దగా అరవడం ప్రారంభించింది. దీన్ని గమనించిన గ్రామస్థులు వెంటనే అటవీ అధికారులకు తెలియజేశారు. కాశీబుగ్గ రేంజర్ మురళీకృష్ణనాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం అనకాపల్లి వచ్చి జీడితోటలో ఫెన్సింగ్‌కు చిక్కుకున్న ఎలుగుబంటిని చూశారు. విశాఖపట్నంలోని జంతు ప్రదర్శన శాల అధికారులకు సమాచారం అందజేశారు. అక్కడి వైద్యాధికారి పి.భానుబాబు, స్థానిక పోలీసులు, అటవీ సిబ్బంది ఆ ఎలుగు బంటిని ఆ కంచె నుంచి రక్షించి బంధించి బోనులోకి ఎక్కించారు. ప్రత్యేక వాహనంలో విశాఖపట్నం జూకు తరలించారు. సుమారు 50 కిలోల బరువు ఉంటుందని, దీని వయస్సు రెండేళ్లు ఉంటుందని అటవీ అధికారులు చెబుతున్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం

* హైవేపై వ్యాన్‌ను ఢీకొన్న కారు
* ఇద్దరు మృతి, ఐదుగురికి గాయాలు
* వారంతా ఒడిశావాసులే



3లో

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## రోడ్డు పనుల పరిశీలన

**జి.సిగడాం, ఫిబ్రవరి8 (వార్త):** జిల్లాలో నిర్మిస్తున్న బీటి రోడ్లు పనుల్లో నాణ్యాతా ప్రమాణాలు ఉండేలా చర్యలు చేపడుతున్నామని రోడ్లు భవనములు శాఖ ఎస్ఈ పుచ్చల సత్యన్నారాయణ తెలిపారు. ఆదివారం ఆనందపురం - దవళపేట గ్రామాల మధ్యలో నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రెండు వందల కోట్ల రూపాయలతో వివిధ రకాల పనుల కోసం నిధులు మంజూరైందన్నారు. రాజాం- చిలకపాలెం ప్రధాన రహదారిలో గేదెలపేట నుండి వాంగ్రంగి రైల్వే వంతెన వరకు 2 కోట్లు 75 లక్షల రూపాయిలతో 6.4 కిలోమీటర్లు మేర బీటీ రోడ్డు పనులను శరవేగంతో చేపట్టామన్నారు. ఇప్పటికే నాణ్యాతా ప్రమాణాల శాఖ ఈఈ శ్రీనివాస్ నాయక్, డిఈఈ బి. గౌరీశ్వరరావు సిబ్బందితో తనిఖీలు కూడా చేశారని తెలిపారు. రోడ్డు పనుల్లో ఎక్కడ రాజీలేకుండా చూస్తున్నామన్నారు. ఆయన వెంట కార్యనిర్వాహక ఇంజనీర్ తిరుపతిరావు, డీఈఈ గణపతిరావు, ఏఈఈ తవిటిరాజు, సిబ్బంది ఉన్నారు.






## రగ్బీ జిల్లా జట్ల ఎంపిక

**శ్రీకాకుళం స్పోర్ట్స్, ఫిబ్రవరి 8 (వార్త):** శ్రీకాకుళం జిల్లా రగ్బీ అసోసియేషన్ టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో అండర్-12 విభాగంలో ఆదివారం జిల్లా బాలుర, బాలికల జట్లను ఎంపిక చేసినట్టు శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు డొంకన రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి పొన్నాడ పార్వతీశం తెలిపారు. 210 క్రీడాకారులు ఈ ఎంపికలకు తరలివచ్చారు. 12 మంది బాలురు, 12 మంది బాలికల జట్లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో మంచి ప్రతిభ కనబరిచి శ్రీకాకుళం జిల్లాకి మంచి పేరు తీసుకురావాలన్నారు. గుంటూరు ఈనెల 13,14 తేదీల్లో పోటీలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా రగ్బీ ఆర్గనైజేషన్ సెక్రటరీ బాడాన నారాయణరావు, కె.రఘునాథరావు, బి.విజయకుమార్, ఎస్.సుజాత, జ్యోతి రాణి, అలివేణి, కవిటి పాపారావు, టి. సుందర్రావు, ఎస్.శైలజ, ప్రశాంతి, త్రివేణి, పి.జగదీష్, ఎస్.రమేష్, సత్యనారాయణ, శ్యామలరావు, సీతయ్య, పూర్ణచందర్రావు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## లచ్చయ్యపేటలో ఉచిత మెగా వైద్య శిబిరం




**శ్రీకాకుళం టౌన్, ఫిబ్రవరి 8(వార్త):** కేవలం పట్టణాల్లో మాత్రమే అందుబాటులో ఉన్న స్పెషాలిటీ వైద్యాన్ని గ్రామస్థాయిలో ఉచితంగా అందుబాటులోకి తేవటమే జేసిఐ సంస్థ ముఖ్య ఉద్దేశం అని జేసిఐ శ్రీకాకుళం మెయిన్ సంస్థ అధ్యక్షురాలు తమ్మినేని ఉషారాణి అన్నారు. పొందూరు మండలం లచ్చయ్యపేట గ్రామంలో ఆదివారం జేసిఐ ఆధ్వర్యంలో శ్రీకాకుళం మెడికవర్ హాస్పిటల్ సహకారంతో నిర్వహించిన మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సుమారు వంద మందికి గైనకాలజిస్ట్ డా.బలగ రజని, డా.చరిష్మా, డా.కోటేశ్వరరావులు వైద్యసేవలు అందించారు. అలాగే బీపీ, రక్త పరీక్షలు, ఈసీజీ పరీక్షలు చేశారు. అలాగే అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వైద్య శిబిరం విజయవంతం కావడానికి ఈ ప్రాజెక్ట్ చైర్మన్ జేసి తేజస్వి, సత్యకుమార్ దంపతుల సహకారం మరువలేదని, జేసిఐలో ఇలాంటి సభ్యులు ఉండటం సంస్థకు గర్వకారణం అని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు జామి భీమశంకర్ రావు అన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ జామి కృష్ణకాంత్, లామ్ అడ్వైజర్ మణిశర్మ, వైస్ ప్రెసిడెంట్ గొండు సురేంద్రనాథ్, సభ్యులు నరేంద్ర, రజని, హేమలత, తిరుమలాదేవి, అనురాధ, ఇమ్మది రాజేంద్ర, జూనియర్ జేసీ స్నేహాంజలి తదితర సభ్యులు పాల్గొన్నారు.

## పోటెత్తిన ఆదిత్య ఆలయం



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 8 (వార్త):** అరసవల్లి సూర్యనారాయణ స్వామిని దర్శించుకునేందుకు భక్తులు ఆదివారం పోటెత్తారు. టికెట్లు రూపేనా రూ.11,33,100, పూజలు, విరాళాల రూపంలో రూ.2,51,239, ప్రసాదాల రూపంలో రూ.3,20,885, దర్శనం, సూర్యనమస్కారములు, వివిధ సేవలు, ప్రసాదాల బుకింగ్‌ను మరింత సులభతరం చేస్తూ ఆన్‌లైన్ రిజర్వేషన్ ద్వారా రూ.4,27,745లు స్వామి వారికి ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో ప్రసాద్ తెలిపారు. అలాగే ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వర రావు.. అరసవల్లి సూర్యనారాయణస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ, కార్యనిర్వహణాధికారి ప్రసాద్.. ఎమ్మెల్యే ఈశ్వరరావుకు స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు, వేద పండితులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత



**మందస, ఫిబ్రవరి 8(వార్త):** మందస మండలంలోని డిమిరియా, జిల్లుండ గ్రామాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు అనారోగ్యంతో బాధ పడుతుండగా.. వీరికి సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరయ్యింది. పలాస నియోజకవర్గం శాసనసభ్యురాలు గౌతు శిరిష చేతుల మీదుగా వీరికి సీఎం రిలీఫ్ ఫండ్ అందజేశారు. డిమిరియా ముంజేటి దేవరాజు కాలు నొప్పితో.. అనారోగ్యానికి గురయ్యారు. అదేవిధంగా జిల్లుండ గ్రామానికి చెందిన చొప్పరి భరత్ కుమార్ కంటి సమస్యలతో బాధ పడుతుండగా.. ఆయనకు కూడా రూ.24,746లు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరయ్యింది. వీరిద్దరికీ ఈ ఆర్థిక సాయం శిరీష చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో జనసేన మందస మండల అధ్యక్షుడు కుప్పాయి గోపాలరావుతో పాటు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 8 (వార్త):** ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక జిల్లా పరిషత్‌లో సోమవారం నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలు నేరుగా, లేదా ఆన్లైన్‌లో మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు. అర్జీలు, వాటి స్థితిని తెలుసుకునేందుకు 1100కి నేరుగా కాల్ చేయవచ్చని వివరించారు.

# అప్పల సూర్యనారాయణ మృతి పార్టీకి తీరని లోటు

### * నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



**శ్రీకాకుళం టౌన్, ఫిబ్రవరి 8 (వార్త):** శ్రీకాకుళం జిల్లా వెలమ సంక్షేమ సంఘం తరఫున మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ సంతాప సభలో నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాల్గొని సంతాపాన్ని వ్యక్తం చేశారు. తొలుత అప్పల సూర్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజకీయమే తన జీవిత ధ్యేయంగా భావించి ప్రజాసేవకు అంకితమై జీవితం గడిపిన నాయకుడు గుండ అప్పల సూర్యనారాయణ అని కొనియాడారు. తెలుగుదేశం పార్టీలో చిన్న స్థాయి పదవితో రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి మంత్రిగా కూడా ఎదిగారన్నారు. పార్టీ బలోపేతానికి ఆయన చేసిన సేవలు, ప్రజల సమస్యలపై చూపిన చిత్తశుద్ధి, కార్యకర్తలతో మమేకమై పనిచేసిన తీరు చిరస్మరణీయమని తెలిపారు. సాధారణ కార్యకర్తకు కూడా విలువనిచ్చిన గొప్ప నాయకుడిని కోల్పోవడం తెలుగుదేశం పార్టీకి, జిల్లా రాజకీయాలకు తీరని లోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నరసన్నపేట నియోజకవర్గం సమన్వయకర్త బగ్గు అర్చన, వెలమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.


## డీఎస్పీలుగా ఎంపికైన వారికి ఎమ్మెల్యే బగ్గు అభినందనలు



**నరసన్నపేట, ఫిబ్రవరి 8(వార్త):** నరసన్నపేట మండలం రావులవలస గ్రామానికి చెందిన పైల సుందరరావు, ఎచ్చెర్ల మండలం ఎంఎస్‌పురం గ్రామానికి చెందిన సంపతిరావు శివనాగ గౌరీ ఇటీవల నిర్వహించిన గ్రూప్-1 పోటీ పరీక్షల్లో డీఎస్పీలుగా ఎంపిక కావడం గర్వంగా ఉందని నరసన్నపేట శాసన సభ్యులు బగ్గు రమణమూర్తి అన్నారు. కత్తిరివానిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డీఎస్పీలుగా ఎంపికైన వారు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిద్దరిని సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కఠినమైన పోటీ పరీక్షల్లో విజయం సాధించి పోలీసు సేవల్లో ఉన్నత స్థానం దక్కించుకోవడం యువతకు ఆదర్శమన్నారు. భవిష్యత్తులో ప్రజలకు న్యాయం చేయడంలో నిబద్ధతతో, నిజాయితీగా సేవలందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు చౌదరి నారాయణమూర్తి, డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, నరసన్నపేట వంశధార డిస్ట్రిబ్యూటరి కమిటీ చైర్మన్ శిమ్మ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ శిమ్మ జగన్నాథం, పల్లి శంకర్ నాయుడు, పంచి రెడ్డి శ్రీధర్, పాపారావు, బలగ ప్రహర్ష, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు రావాడ గణపతిరావు, పల్లి ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ బలోపేతానికి సమన్వయంతో పనిచేద్దాం

### * పార్టీ హిరమండలం మండల అధ్యక్షుడు మీసాల వెంకటరామకృష్ణ



**హిరమండలం, ఫిబ్రవరి 8 (వార్త):** వైసీపీని బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసి సమన్వయంతో పనిచేద్దామని పార్టీ హిరమండలం మండల అధ్యక్షుడు మీసాల వెంకటరామకృష్ణ అన్నారు. ఆదివారం హిరమండలంలోని సత్యనారాయణ కళ్యాణ మండపంలో హిరమండలం మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకూ కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం తగ్గిపోతుందన్నారు. ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. టీడీపీ శ్రేణుల అక్రమాలు, అవినీతి రోజురోజుకూ ఎక్కువవుతోందని విమర్శించారు. కూటమి ప్రభుత్వ అక్రమాలను ప్రశ్నించడంతో పాటు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. సమావేశంలో వైసీపీ శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి అందవరం వెంకట సురేష్. వైస్ ఎంపీపీ వంగపల్లి సావిత్రి, చిన్నారావు, ఎంపీటీసీ లుకలాపు సావిత్రి ప్రసాద్, సర్పంచ్ లు వంజరాపు చిరంజీవి, కో ఆప్షన్ మెంబర్ విష్ణు పండా, మాజీ జడ్పీటీసీ లోలుగు లక్ష్మణరావు, మూకల్ల చిన్నయ్య, వైసీపీ సీనియర్ నాయకులు అల్లు శంకర్రావు, సిమ్మ తేజ, నడిమింటి కృష్ణ, లుకలాపు శ్రీనివాస్, బత్తుల వెంకట్రావు, జోగు శ్రీనివాసరావు మీసాల శంకర్రావు, బూడి ఆదినారాయణ, మాజీ సర్పంచ్‌లు మామిడి గంగాధర్, అంగూరు భాస్కరరావు, సిమ్మ పాపయ్య, పొట్నూర్ సింహాచలం, గొర్లి తిరుపతి, సదాశివుని రామశంకర్, సైలాడ పాపారావు, కోనంగి మాధవరెడ్డి, తోనంగి తౌడు, లొట్టి వెంకట్రావు, రాడ లక్ష్మీనారాయణ, పాలకొండ సింహాచలం, బాగాది నరసింహులు, వాకాడ రాజారావు, సవర గోపాలం, లుకలాపు రమణయ్య, జన్ని మొగలింగం, జన్ని శ్రీనివాసరావు, కన్నబాబు, చక్క బాలకృష్ణ, ఈశ్వరరావు, పుప్పాల మురళి, సమ్మెని కృష్ణ, సవర జమ్మయ్య, బూర్ల గోవింద, లక్ష్మణరావు, చిరంజీవి, చల్లా పూర్ణచంద్రరావు, సాదు సింహాచలం, వెంకటరమణ.తంప కృష్ణారావు తామాడ రామారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అధికారులు తప్పు చేసి గత ప్రభుత్వంపై రుద్దుతారా?

### * నిలదీసిన వైసీపీ నేతలు

**పలాస, ఫిబ్రవరి 8 (వార్త):** తప్పు అధికారులు చేసి గత ప్రభుత్వంపై రుద్దడం సమంజసం కాదని, గతంలో రెవెన్యూ అధికారులే సర్వే చేశారని చిన్నంచల ఎంపిటిసి సభ్యుడు బమ్మిడి దుర్యోధనరావు, మండల ప్రత్యేక ఆహ్వానితులు ఉంగ సాయి కృష్ణ, సభ్యులు అన్నారు. పలాస మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఎంపీపీ ఉంగ ప్రవీణ అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో నాడు నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం దాతలు, స్వచ్ఛంద సంస్థలు, పూర్వ విద్యార్థులు వైపు చూడాల్సిన పరిస్థితిని ఎండగట్టారు. బొడ్డపాడు ఉన్నత పాఠశాలలో భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని వాటిని తొలగించాలని, త్వరగా నిధులు మంజూరు చేసి అసంపూర్తిగా ఉన్న భవనాలను పూర్తి చేయాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పాఠశాలలకు నిధులు మంజూరు చేయకుండా దాతలు సహకారం కోసం ఎదురుచూడడం సిగ్గు చేటన్నారు. నిధులు మంజూరు చేయకపోతే పాఠశాలలు ఎలా అభివృద్ధి చెందుతాయని మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉంగ సాయికృష్ణ, బొడ్డపాడు సర్పంచ్ తామడ మదన్.. విద్యాశాఖా అధికారి సీహెచ్ శ్రీనివాసరావును నిలదీశారు. ఎంపీటీసీ బమ్మిడి దుర్యోధన మాట్లాడుతూ గ్రామాల్లో పైపులైన్లు వేశారు




తప్ప నీరు సక్రమంగా పంపిణీ జరగడం లేదని, ఎక్కడెక్కడ పైపులైన్లు లీక్‌లు, కొళాయిలు మరమ్మతులకు గురవుతున్న ఎందుకు పట్టించుకోవడం లేదని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ధనుంజయను నిలదీశారు. అక్షర ఆంధ్ర గ్రామాల్లో ఎక్కడా జరగడం లేదని, గ్రామాల్లో ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా వాలంటీర్లను ఎలా నియమిస్తారని ఏపీఎం జాంబవతిను మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉంగ సాయికృష్ణ ప్రశ్నించారు. సర్పంచ్ తామడ మదన్ మాట్లాడుతూ గ్రామాల్లో ఇటీవల ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహించారని, స్థానిక ప్రజాప్రతినిధులకు ఎందుకు ఆహ్వానం పలకలేదని పశుసంవర్ధక శాఖ అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పలాస రెవెన్యూ అధికారి మన్మథరావు మాట్లాడుతూ పాసు పుస్తకాల్లో తప్పులు లేకుండా సరిచేసి పంపిణీ చేస్తామని చెప్పడంతో ఎంపిటిసి బమ్మిడి దుర్యోధన, సాయికృష్ణ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రెవెన్యూ అధికారులు, సిబ్బందే కదా సర్వే చేశారన్నారు. కూటమి ప్రభుత్వంలో మీరే రెవెన్యూ అధికారులుగా ఉండి పాసు పుస్తకాలు తప్పులు సరి చేసి పంపిణీ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇలాగేనా విధులు నిర్వహిస్తున్నారంటూ నిలదీశారు. పలాస ఉద్యానశాఖ అధికారి శంకర్ దాస్ మాట్లాడుతూ ఉద్యానవన పంటలకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని, ఇప్పటి వరకు సుమారు 14 వేల హెక్టార్లకు సబ్సిడీ మంజూరైందని, మిగిలిన పంటలకు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఓ వసంత కుమార్, డిప్యూటీ ఎంపిడిఓలు మెట్ట వైకుంఠ రావు, సవర ఉమాపతి, ఎఓ అనురాధ సీనియర్ అసిస్టెంట్ మన్మథరావు, వైస్ చైర్మన్లు తలగాన శ్రీరాములు, సవర దాలమ్మ, ఎంపిటిసిలు సర్పంచులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పీఆర్‌సీ కమిటీని తక్షణం ఏర్పాటు చేయండి

**శ్రీకాకుళం, ఫిబ్రవరి8(వార్త):** నగరంలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో కార్య నిర్వహణ సమితి సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సహాధ్యక్షులు, జిల్లా ఇంచార్జ్ చింతాడ దిలీప్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు తక్షణమే పీఆర్‌సీని ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా గౌరవ అధ్యక్షులు టెంక చలపతిరావు మాట్లాడుతూ, పెన్షనర్లకు, ఉపాధ్యాయులకు డీఏ బకాయి చెల్లింపుల్లో జరిగే అవకతవకలను వెంటనే సరి చేస్తూ వారి ఖాతాల్లోకి తక్షణమే జమ చేయాలన్నారు. జిల్లా అధ్య క్షులు బల్లెడ రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి బుక్కూరు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేలా విద్యాశాఖాధికారులు చర్యలు చేపట్టాల న్నారు. ఉపాధ్యాయులకు గత కొన్ని సంవత్సరాలుగా చెల్లించని సరెండర్ లీవ్, ఎన్‌క్యాష్‌మెంట్‌తో పాటు మిగిలిన బకాయిలను చెల్లించడానికి రోడ్డు మ్యాప్ ప్రకటించి తక్షణమే చెల్లించాలన్నారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు కొత్త పెన్షన్ నిబంధనలు అమలు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కార్యదర్శి పి.బాలాజీ రావు, జిల్లా ఉపాధ్యక్షులు ఎం.భుజంగరావు, అనంత ఆచార్యులు, వైవీ రమణ, కార్యదర్శి బి.కృష్ణారావు పాల్గొన్నారు.







## వంశధార కాలువకు గండి

**నరసన్నపేట, ఫిబ్రవరి 8 (వార్త):** నరసన్నపేట మండల కేంద్రంలోని స్థానిక జమ్మూ కూడలి సమీపంలో ఉన్న ఎన్బీసీ వంశధార కాలువకు గండి పడినట్లు సంబంధిత శాఖ ఏఈ సిల్లా హరీశ్ కుమార్ తెలిపారు. ఆదివారం ఉదయం కాలువకు గండి పడిన ప్రాంతాన్ని గుర్తించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమస్యను ఈఈ మురళీమోహన్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కాలువకు ఏర్పడిన గండిని తక్షణమే మరమ్మతు చేసి నీటి సరఫరా పునరుద్ధరించేందుకు త్వరితగతిన చర్యలు చేపడతామన్నారు. గండి పడటంతో కాలువలో నీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడిందని, పరిసర ప్రాంతాలకు నీటి సరఫరాపై ప్రభావం పడే అవకాశం ఉంది.

## రహదారుల అభివృద్ధితోనే ఏ ప్రాంతమైన అభివృద్ధి

### * ఎమ్మెల్యే గౌతు శిరీష



**పలాస, ఫిబ్రవరి 8 (వార్త):** రహదారుల అభివృద్ధితోనే ఏ ప్రాంతమైన అభివృద్ధి చెందుతుందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస నియోజకవర్గం వజ్రపుకొత్తూరు మండలం ఉద్దానం గోపినాథపురం పంచాయతీ మెలియాపుట్టి గ్రామంలో కూటమి ప్రభుత్వం వచ్చాక గౌతు శిరీష నాయకత్వంలో మల్లేన చంద్రయ్య ఇంటి నుండి మెలియాపుట్టి బి టి రోడ్డు వరకు 460 మీటర్ల సీసీ రోడ్డు, గోపినాథపురం పంచాయతీ యంపల్లి కోలని పార్వతీపురం అమ్మవారు గుడి నుండి కల్లేపల్లి దామోదరరావు ఇంటి వరకు 615 మీ, పంచాయతీ మొత్తం మీద 1075 మీ సీసీ రోడ్డులు సుమారు 30 లక్ష రూపాయలు నిధులు మంజూరు చేసి నిర్మాణం జరిగింది. ఆదివారం ఆ నిర్మాణాలను పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రారంభించారు. కూటమి నాయకులు మదనాల జోగారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వజ్రపుకొత్తూరు మండల టీడీపీ అధ్యక్షులు సూరాడ మోహనరావు, పీరుకట్ల విఠల్, పుచ్చ ఈశ్వరరావు, కర్ని రమణ, గొరకల వసంతస్వామి, గోవింద్, పాపారావు, గోపీనాథపురం పంచాయతీ కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## సామాజిక భవనం ప్రారంభం



**పలాస, ఫిబ్రవరి 8 (వార్త):** చిన్నబడాంలోని సామాజిక భవనాన్ని ఎమ్మెల్యే గౌతు శివాజీ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలోని చిన్నబడాంలో ఎంపీ లాడ్స్ ద్వారా సుమారు 9 లక్షలు రూపాయలు నిధులతో సామాజిక భవనాన్ని నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు, ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, మున్సిపాలిటీ టిడిపి అధ్యక్షులు బడ్డ నాగరాజ, జిల్లా గ్రంథాలయ చైర్మన్ పీరుకట్ల విఠల్, సప్ప నవీన్, లొడగల కామేష్, గాలి కృష్ణారావు, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అప్పయ్య దొర.. ఆదర్శప్రాయుడు

**పలాస, ఫిబ్రవరి 8 (వార్త):** సామాజిక సేవ, నైతిక విలువలు, న్యాయం కోసం అంకితభావంతో జీవించిన అప్పయ్యదొర ఆదర్శప్రాయుడని వక్తలు కొనియాడారు. హనుమంతు అప్పయ్య దొర 91వ జయంతి సందర్భంగా ఆదివారం పలాసలోని కేటీ రోడ్డులోని అప్పయ్య దొర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆయన చూపిన మార్గంలో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, ఏపిటిపిసి చైర్మన్ వజ్జ బాబురావు, ప్రముఖ న్యాయవాది ఒడిశ బాలకృష్ణ, కౌన్సిలర్ శ్రీకాంత్, ప్రముఖ సామాజికవేత్త, శిరిడి సాయి సంస్థాన్ ట్రస్ట్ చైర్మన్ దువ్వాడ శ్రీధర్ (బాబా), అప్పయ్య దొర కుటుంబ సభ్యులు హనుమంతు వెంకట్రావు దొర, రామ్మోహన్ దొర (బుజ్జి మాస్టర్), హనుమంతు మురళీమోహన్ దొర, రాజకీయ పార్టీలకు అతీతంగా వివిధ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.











### నందిగాంలో అప్పయ్యదొర జయంతి వేడుకలు

**నందిగాం:** మాజీ ఎమ్మెల్యే హనుమంతు అప్పయ్యదొర 91వ జయంతి వేడుకలు ఆదివారం నందిగాం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. వైఎస్ఆర్సిపి టెక్కలి నియోజకవర్గ ఇన్చార్జ్ పేరాడ తిలక్.. అప్పయ్యదొర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ అప్పయ్యదొర ఆశయాలను ప్రతిఒక్కరు కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో నందిగాం మండలంలోని రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి అనుబంధ విభాగాల నాయకులు, ఎంపీపీలు, మండల అనుబంధ విభాగాల నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు గ్రామ కమిటీ సభ్యులు, వైఎస్ఆర్సిపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కారానికి
## పోరాటాలే శరణ్యం


* ఏపీటీఎఫ్ ఉమ్మడి రాష్ట్ర మాజీ అధ్యక్షులు రాజశేఖర్




**పలాస, ఫిబ్రవరి 8 (వార్త):** విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యమని ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏ పి టి ఎఫ్) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు సన్నశెట్టి రాజశేఖర్ అన్నారు. ఆదివారం పలాసలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడియస్యు) జిల్లా జనరల్ కౌన్సిల్‌లో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు విద్యార్థులు సంఘటిత ఉద్యమాలను నిర్మించాలన్నారు. విద్యారంగం కార్పొరేటీకరణకు, కాషాయీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. విద్యారంగంలో పిపిపి విధానాన్ని తీసుకొచ్చి వైద్య విద్య పేదలకు అందని ద్రాక్షగా పాలకులు చేస్తున్నారని, ఈ విధానాలను తిప్పికొట్టవలసిన అవసరం ఆవశ్యకత విద్యార్థులపై ఉందని అన్నారు. పి.డి.యస్.యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్ కుమార్ మాట్లాడుతూ దేశంలో మోడీ ప్రభుత్వం కేజీ నుండి పీజీ వరకు విద్యారంగాన్ని ధ్వంసం చేస్తుందని అన్నారు. యు జి సి ముసాయిదా డ్రాఫ్ట్ సవరణ చేసి విద్యారంగానికి సంబంధం లేని వ్యక్తులను విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లగా నియమించే కుట్ర చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాల ఫెడరల్ హక్కులను హరిస్తుందన్నారు. విశ్వవిద్యాలయాల్లో ఈక్విటీ సెల్స్ నూతన నిబంధనలు పకడ్బందీగా అమలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలో విద్యారంగంలో అనేక సమస్యలు నెలకొన్నాయని రాష్ట్రవ్యాప్తంగా 7200 కోట్ల రూపాయల ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, గత మూడు సంవత్సరాలుగా సంక్షేమ వసతి గృహ విద్యార్థుల మెస్ కాస్మోటిక్ చార్జీలు ప్రభుత్వాలు పెంచడం లేదని పెండింగ్ లో ఉన్న నిధులు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పిడియస్యు మాజీ రాష్ట్ర నాయకులు వి.మాధవ్ మాట్లాడుతూ విద్యార్థులు యువత భగత్ సింగ్ అల్లూరి స్ఫూర్తితో నిరుద్యోగ సమస్యపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిడియస్యు నాయకులు రవి, విజయ్, రాజు, గణేష్, విజయ్ కుమార్, అరుణోదయ సాంస్కృతిక సమైక్య జిల్లా అధ్యక్షులు సోర్ర రామారావు, వీరస్వామి పాల్గొన్నారు.

## తెలుగు ప్రజల సంక్షేమానికి కృషి చేస్తా

* ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్
* రాయపూర్‌లో ఘనంగా తెలుగు సంఘాల ఆత్మీయ కలయిక



**ఆమదాలవలస, ఫిబ్రవరి 8 (వార్త):** ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర రాజధాని రాయపూర్‌లో రాయపూర్ ఆంధ్ర తెలుగు సమాజ్, కళింగ సమాజ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ పాల్గొని మాట్లాడారు. తెలుగు ప్రజల సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. రాయపూర్‌లో నివసిస్తున్న తెలుగు ప్రజల సమస్యలను ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ద్వారా ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామన్నారు. రాయపూర్ ఆంధ్ర తెలుగు సమాజ్, కళింగ సమాజ్ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. తెలుగు ప్రజలంతా సమష్టిగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఛత్తీస్‌గఢ్ కళింగ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు గౌరీ శంకర్, రాయపూర్ కళింగ సంఘం అధ్యక్షుడు సనపల జగదీష్ రావు, ప్రధాన కార్యదర్శి హిమగిరి, ఆంధ్రా సంఘం అధ్యక్షుడు జి.స్వామి, టీడబ్ల్యూఎస్ అధ్యక్షుడు టి.గోపి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యం అయ్యప్ప, షోలాపురి మఠ కమిటీ సభ్యులు, కళింగ, ఆంధ్రా సంఘాల కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో తెలుగు ప్రజలు పాల్గొన్నారు.

## టిడ్కో ఇళ్ల నిర్మాణాల పరిశీలన

**ఆమదాలవలస, ఫిబ్రవరి 8 (వార్త):** ప్రజా సమస్యలను ప్రభుత్వానికి చేరవేసే ఉద్దేశంతో బీజేపీ ప్రజావారధి కార్యక్రమాన్ని చేపట్టిందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పైడి వేణుగోపాలం అన్నారు. ఆదివారం ఆమదాలవలస పురపాలక సంఘ పరిధిలో ఉన్న టిడ్కో కాలనీతో పాటు శ్రీకాకుళం నగరపాలక పరిధిలోని టిడ్కో కాలనీని బీజేపీ బృందం పరిశీలించింది. పలు ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పైడి వేణుగోపాలం మాట్లాడుతూ, నిర్మాణం పూర్తయిన గృహాలను అర్హులైన లబ్ధిదారులకు వెంటనే అందజేయాలన్నారు. కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని, సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ ఐటీ సెల్ కన్వీనర్ సింగుపురపు వెంకటరమణ, ప్రజావారిధి కో-కన్వీనర్ వైస్ జగన్మోహనరావు, జిల్లా ఉపాధ్యక్షులు, శ్రీకాకుళం జిల్లా జనరల్ సెక్రటరీ పేడాడ సూరపు నాయుడు, సంపతిరావు నాగేశ్వరరావు, వి. గోవిందరావు, పూజారి చెల్లయ్య, చిగిలిపల్లి రాజేష్, పైడి హరికృష్ణ, బెండి ప్రసాద్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# భక్తుల మనోభావాలతో ఆటలా?

* శ్రీవారి లడ్డూపై ఎందుకింత అబద్ధాలు
* నిజాలు తేలినా చంద్రబాబు ఎందుకు క్షమాపణ చెప్పరు?
* రాజకీయ లబ్ధి కోసం దేవుడిని వాడుకోవడం దుర్మార్గం
* మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్

**నరసన్నపేట, ఫిబ్రవరి 8 (వార్త):** తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో జంతువుల కొవ్వు కలిసిందని పచ్చి అబద్ధాలు చెప్పి, కోట్లాది మంది భక్తుల విశ్వాసాలను చంద్రబాబు నాయుడు దెబ్బతీశారని, ఇప్పుడు ఆ ఆరోపణల్లో నిజం లేదని దేశంలోని అత్యున్నత సంస్థలు తేల్చిచెప్పినా, ఆయనలో పశ్చాత్తాపం లేకపోవడం దురదృష్టకరమని మాజీ ఉప ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ధ్వజమెత్తారు. నరసన్నపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు గానీ, గొడ్డు మాంసం కొవ్వు గానీ లేదని ఎన్ డి డి బి, ఎన్ డి ఆర్ ఐ వంటి ప్రతిష్టాత్మక సంస్థలు స్పష్టం చేశాయన్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి అపవిత్రపు మాటలు మాట్లాడి తిరుమల ప్రతిష్టను చంద్రబాబు మసకబార్చారన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం దేవుడిని, ప్రసాదాన్ని వాడుకోవడం క్షమించరాని నేరమన్నారు. నిజాలు బయటపడ్డాక చంద్రబాబు, పవన్ కళ్యాణ్ భక్తులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తప్పుడు ప్రచారాలతో భక్తుల్లో సందేహాలు రేకెత్తించి, వారి మనోభావాలను గాయపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే ఇటువంటి దారుణమైన ఆరోపణలు చేస్తున్నారని ధర్మాన విమర్శించారు. చంద్రబాబు హయాంలోనే టీటీడీకి నాణ్యత లేని ట్యాంకర్లు వెళ్లాయని సీబీఐ విచారణలో తేలిందని, ఆ నిజాన్ని కప్పిపుచ్చేందుకు ఇప్పుడు వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రశ్నిస్తున్న మా నాయకుల ఇళ్లను తగలబెట్టడం, అధికార బలంతో భయపెట్టడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. అయోధ్యకు పంపిన లడ్డూల విషయంలోనూ పవన్ కళ్యాణ్ పదేపదే అబద్ధాలు చెబుతూ భక్తులను అయోమయానికి గురిచేస్తున్నారని దుయ్యబట్టారు. టీటీడీని ప్రక్షాళన చేస్తానని చెబుతూ సమర్థులైన అధికారులను ఎందుకు బదిలీ చేస్తున్నారని ధర్మాన ప్రశ్నించారు. చంద్రబాబు తన నీచ ప్రచారాలను ఇప్పటికైనా కట్టిపెట్టి, హిందువుల మనోభావాలను గౌరవించాలని హితవు పలికారు. పరిపాలనలో ఘోరంగా విఫలమై, హామీలను అమలు చేయలేక దేవుడి పేరుతో రాజకీయం చేయడం మానుకోవాలని సూచించారు. విలేకరుల సమావేశంలో ఎంపీపీలు ఆరంగి మురళీధర్, వాన గోపి, ముద్దాడ బైరాగి నాయుడు, జెడ్పీటీసీ చింతు రామారావు, రాష్ట్ర కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు, రాష్ట్ర పొందర కూరకుల విభాగం అధ్యక్షులు రాజపు అప్పన్న, డీఎల్‌డీఏ చైర్మన్ నక్క తులసి దాస్, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు గుప్తా, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు ముంజేటి కృష్ణారావు, జిల్లా అధికార ప్రతినిధి బార్ల వేణు గోపాల్, జిల్లా కార్యదర్శి యాళ్ళ శ్యామసుందర్, నియోజకవర్గ పంచాయతీ రాజ్ అధ్యక్షులు బగ్గు రమణయ్య, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షులు సురంగి నర్సింగరావు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు కల్లేపల్లి లక్ష్మణరావు, మండల అధ్యక్షులు కణితి కృష్ణారావు, వరుదు వంశీకృష్ణ, సర్పంచ్ బురల్లి శంకర్, మండల బూత్ కమిటీ అధ్యక్షులు బబ్బోది ఈశ్వరరావు, మండల పంచాయతీ రాజ్ అధ్యక్షులు దంత రమణ, దుల్ల రమణ, కత్తిరి అప్పలనాయుడు,వ నేతింటి రాజేశ్వరరావు, తోట భార్గవ్, కనపల అరవింద్, పంచిరెడ్డి శివ తదితరులు పాల్గొన్నారు.



### క్రైం వార్తలు

## ఘోర రోడ్డు ప్రమాదం

* హైవేపై వ్యాన్‌ను ఢీకొన్న కారు
* ఇద్దరు మృతి, ఐదుగురికి గాయాలు
* వారంతా ఒడిశావాసులే

**పలాస, ఫిబ్రవరి 8 (వార్త):** నందిగాం మండలం పాలవలస సమీపంలో జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, ఐదుగురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ వ్యక్తి వ్యాన్‌తో వస్తుండగా వాహనం మరమ్మతులకు గురవడంతో పాలవలస జాతీయ రహదారిపై నిలిపాడు. ఒడిశాలోని గంజాం జిల్లా సున్నాపురం గ్రామానికి చెందిన వాసిపల్లి దాలయ్యకు అనారోగ్యానికి గురికావడంతో శనివారం రాత్రి ఆయన బంధువులు ఏడుగురు విశాఖపట్నంనకు కారులో బయలుదేరారు. వీరి వాహనం పాలవలస వద్ద ఆగి ఉన్న వ్యాన్‌ను ఢీకొట్టింది. దీంతో దాలయ్య (49), వాసిపల్లి మోహినమ్మ (52) అక్కడికక్కడే మృతి చెందారు. వాసిపల్లి నీలాద్రి, వాసిపల్లి ముత్యాలమ్మ, డొంక రామారావు, పొలగల వెంకటేశ్, బుడ్డ భారతి గాయపడ్డారు. స్థానికులు గమనించి వెంటనే నందిగాం పోలీసులకు సమాచారం అందజేశారు. వారు క్షతగాత్రులను టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ముత్యాలమ్మ పరిస్థితి విషమంగా ఉండటంతో శ్రీకాకుళం నగరంలోని రిమ్స్‌కు తరలించారు. నందిగాం ఎస్సై షేక్ మహ్మద్ అలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కారు డ్రైవర్ వాహనాన్ని అతివేగంగా నడపడం వల్ల అదుపుతప్పి వ్యాన్‌ను ఢీకొట్టిందని పలువురు చెబుతున్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546